ప్రజాశక్తి

సోమవారం 29 డిసెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మార్కాపురంలో

ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. త్వరలో మార్కాపురం జిల్లా కాబోతోంది. జిల్లా కేంద్రంగా మారిన తరువాత మార్కాపురం లోని ఇరుకు రహదారుల్లో రాకపోకలకు కష్టంగా మారే స్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు గత ఏడాది అధికారులు హడావుడిగా వన్-వే మార్గంలో ప్రయాణించేలా చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత వన్-వే మార్గం ఏమైందో తెలియదు. ఒకే మార్గంలో రాకపోకలు సాగించడంతో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి.

కాలేజీ రోడ్డులో వాహనాల రద్దీ

మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో రద్దీ ఎక్కువ ఉంటోంది. పెరిగిన వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్యగా మారింది. ఇదే మార్గంలో కమలా షాపింగ్ మాల్, లక్కీ షాపింగ్ మాల్, సిఎంఆర్ షాపింగ్ మాల్‌లతో పాటు ఇతర వ్యాపారాలన్నీ కాలేజీ రోడ్డు వైపు వచ్చాయి. ఈ కారణంగా పట్టణంలో కాలేజీ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలతో పాటు శ్రీశైలం, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్ వైపు రాకపోకలన్నీ ఇదే మార్గంలో సాగించాలి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కాలేజీ రోడ్డులో ఆక్రమణలు కూడా పెరిగాయి. రహదారి కుచించుకుపోవడంతో భారీ వాహనాలు ఎదురు పడిన సమయంలో ఇబ్బందిగా మారుతోంది. రోజుకు లెక్కలేనన్ని సార్లు ట్రాఫిక్ నిలిచిపోతోంది. పండుగల సమయాల్లో మరింత రద్దీగా ఉంటోంది.

ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు గత ఏడాది జులైలో వన్-వే మార్గంలో ▶ 2లో

అంగన్‌వాడీల అలుపెరుగని పోరాటం

స్ఫూర్తిదాయకం

సిఐటియూ నేతృత్వంలో సాధించిన విజయం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్మికవర్గ ఉద్యమాల చరిత్రలో కొన్ని పోరాటాలు కాలాన్ని దాటి నిలుస్తాయి. ప్రకాశం జిల్లాలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సాగించిన ఉద్యమం అటువంటి పోరాట పటిమకు చక్కని ఉదాహరణ. సీఐటీయూ జాతీయ మహాసభలు జరుగుతున్న తరుణంలో, ఈ ఉద్యమ అనుభవాలు ఒకసారి పరిశీలిస్తే అవి కేవలం డిమాండ్ల జాబితా మాత్రమే కాదు. కార్మికవర్గ ఆత్మగౌరవానికి, సంఘటిత శక్తికి నిలువెత్తు సాక్ష్యం.

అవసరంగా మారిన పోరాటం

2023 డిసెంబర్ 12న మొదలైన అంగన్‌వాడీ సమ్మె, జనవరి 22 వరకు కొనసాగింది. జిల్లాలోని అన్ని ప్రాజెక్టులలో సమ్మెకు సంపూర్ణ స్పందన లభించింది. అతి తక్కువ వేతనాలు, రిటైర్మెంట్ భద్రత లేకపోవడం, గ్రాట్యూటీ అమలు కాని పరిస్థితి, మినీ వర్కర్లకు ప్రమోషన్లు లేకపోవడం, పెరిగిన పని భారం.. ఇవన్నీ అంగన్‌వాడీలను రోడ్డెక్కించాయి. ఇది ఒక్క రోజులో పుట్టిన ఆవేశం కాదు. ఏళ్లుగా పేరుకుపోయిన అన్యాయాలపై పెల్లుబికిన అంగన్‌వాడీ ఆడపడుచుల ఆక్రందన.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

ఒంగోలులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

నిరసన కేంద్రాల నుంచి ఉద్యమ పాఠశాలల వరకు...

అంగన్‌వాడీల సమ్మె నలభై రోజుల పాటు నిరవధికంగా సాగింది. 13 ప్రాజెక్టులలో 16 సమ్మె శిబిరాలు ఏర్పాటు కావడం ఈ ఉద్యమ ప్రత్యేకత. ఈ శిబిరాలు కేవలం నిరసనలకు మాత్రమే పరిమితం కాలేదు. ఆటలు, పాటలు, మిమిక్రీలు, వంటావార్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టడీ సర్కిళ్లు.. ఇవన్నీ శిబిరాలను ఉద్యమ పాఠశాలలుగా మార్చాయి. కార్యకర్తల మధ్య అనుబంధం ఏర్పడేందుకు దోహదపడింది. క్రిస్మస్ పండుగ మొదలు నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి సంబరాలు కూడా ఈ శిబిరాల్లోనే జరుపుకుంటూ, 'పోరాటమే ▶ 2లో

ప్రభుత్వ భవనాలు

నిరుపయోగం

కోట్ల డబ్బు వృథాయేనా? ◆ నిధులు వెచ్చిస్తే అందుబాటులోకి..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు చేపట్టి వివిధ దశల్లో ఉన్న పలు ప్రభుత్వ భవనాలు గడచిన ఐదేళ్ల కాలంగా అసంపూర్తి దశలోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం ఈ భవనాల నిర్మాణం గురించిన అంశాన్ని పక్కన పెట్టడంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఆలోచనతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఇందుకోసం సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లు, డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. పంచాయతీల్లో ఉన్న జనాభా ఆధారంగా మొత్తంగా 1,345 ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అయితే ప్రారంభం నుంచి సదరు భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లుల మంజూరులో నెలకొన్న విపరీత జాప్యం కారణంగా పనులు అంతంత మాత్రంగానే జరిగాయి. దీంతో మంజూరయిన భవనాల్లో 347 మాత్రమే పూర్తికాగా, వివిధ దశల్లో 456 భవనాలు ఉన్నాయి. మంజూరయి అసలు నిర్మాణానికి నోచుకోని భవనాల సంఖ్య 542. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లు,

అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు (ఫైల్)

డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణాలు పూర్తిగా రద్దుల పద్దులో చేరాయి. భారీఎత్తున సచివాలయాల వారీగా ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు గత వైసిపి ప్రభుత్వం చెప్పడంతో అప్పట్లో అత్యధిక శాతం అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు ఈ భవనాల నిర్మాణానికి పూనుకున్నారు. కాని బిల్లుల మంజూరులో విపరీత జాప్యం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో తాము మొదలుపెట్టిన పనులను వారు నిలిపి వేశారు. కొత్తగా ఎవరూ భవన నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వ భవనాల గురించి పట్టించుకోలేదు. ఈ కారణంగా సదరు భవనాలు అన్నీ నిరుపయోగంగా ఉండిపోయాయి. జిల్లాలో ఐదేళ్ల క్రితం రూ.154 కోట్ల నిధుల అంచనాలతో 397 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. కాని ఇందులో 184 భవన నిర్మాణాలు పూర్తి కాగా 167 వివిధ దశల్లో ఉన్నాయి. 46 భవన నిర్మాణాలు మొదలు కాలేదు. రైతు భరోసా కేంద్ర భవనాలను రూ.70 కోట్ల అంచనాలతో 312 మంజూరు చేశారు. ఇందులో 96 భవనాలు పూర్తి కాగా 130 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. 86 భవనాలు నిర్మాణానికి నోచుకోలేదు. గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలు రూ.63 కోట్ల అంచనాలతో 334 మంజూరయ్యాయి. ఇందులో 67 భవనాలు పూర్తి కాగా 159 వివిధ ▶ 2లో

9 గేమ్స్ 9 విజయాలు

- చదరంగంలో ప్రపంచాన్ని జయించిన ఒంగోలు చిన్నారి
- వాకా లక్ష్మీ ప్రాజ్ఞిక సంచలన ప్రస్థానం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటున్న చిన్నారి ప్రాజ్ఞిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పసి వయసులోనే బోర్డు మీద రాజులు, రాణులను కదిలిస్తూ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది ఒంగోలు ముద్దుబిడ్డ వాకా లక్ష్మీ ప్రాజ్ఞిక. సెర్బియాలో జరిగిన వరల్డ్ స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్-2025లో అండర్-7 బాలికల విభాగంలో 9 గేమ్స్, 9 విజయాలతో భారత్‌కు ఏకైక స్వర్ణ పతకాన్ని సాధించి, అంతర్జాతీయ చదరంగ వేదికపై భారత జెండాను గర్వంగా ఎగరవేసింది.

చదరంగం పరిచయం.. అక్కే తొలి గురువు..

ప్రాజ్ఞిక చదరంగంలోకి అడుగుపెట్టింది పుస్తకాల ద్వారా కాదు, మరో ఇతర చదరంగ నిపుణుల సహకారంతో కాదు. తన అక్క వరేణ్య ఆటను ఆసక్తిగా గమనిస్తూ ఎదిగింది. వరేణ్య స్వయంగా రాష్ట్ర స్థాయి చదరంగ క్రీడాకారిణి కావడంతో, ఇంట్లోనే ఒక క్రీడా వాతావరణం ఏర్పడింది. అదే వాతావరణం ప్రాజ్ఞికను ప్రపంచ ఛాంపియన్‌గా తీర్చిదిద్దింది. ఇద్దరు అక్కాచెల్లెళ్లు కలిసి ఇప్పటివరకు 230కి పైగా ట్రోఫీలు సాధించడం అరుదైన ఘనత. ఇద్దరికీ రాష్ట్ర క్రీడా విభాగం స్కాలర్‌షిప్ లభించడం ▶ 2లో

మార్కాపురంలో ట్రాఫిక్ కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

రాకపోకలు సాగించాలని పోలీస్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మార్కాపురంలోకి ప్రవేశించేందుకు హోటల్ సెవెన్ హిల్స్ సెంటర్ నుంచి తూర్పువీధి మీదుగా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని నుంచి బయటకు వచ్చేందుకు కాలేజీ రోడ్డులో ప్రయాణించేలా చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ విధమైన నిర్ణయం కొంత ఫలితమిచ్చింది. ట్రాఫిక్ సమస్య తగ్గింది. మూడు నెలల పాటు వన్-వే మార్గం అమలులో ఉంది. ప్రయాణికులు, వాహన చోదకులు, ప్రజలు ఇదేదో బాగుందనుకున్న తరుణంలో వన్-వే మార్గం ఎత్తేశారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ.. వన్-వే మార్గంలో రాకపోకలు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

ప్రభుత్వ భవనాలు నిరుపయోగం

(మొదటిపేజీ తరువాయి)

దశల్లో ఉన్నాయి. 108 భవనాలు నిర్మాణాలు నిలిచిపోయాయి. వీటితో పాటు జిల్లాలో పాల సేకరణ కేంద్ర భవనాలు (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్) రూ.21 కోట్ల అంచనాలతో 142 మంజూరయినట్లు గతంలో ప్రకటించారు. వీటిలో 40 భవనాల నిర్మాణాలు ప్రభుత్వ నిధులతో నిర్మించాల్సి ఉండగా మరో 102 భవనాలను అమూల్ సంస్థ నిర్మించాల్సి ఉంది. అలానే జిల్లాలో డిజిటల్ లైబ్రరీల కోసం రూ.21 కోట్ల అంచనాలతో 129 భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇవి కూడా నిర్మాణాలకు నోచుకోలేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోని చివరి రోజుల్లో పంచాయతీరాజ్ శాఖ నెలవారీగా ఇచ్చే నివేదికల్లోంచి పాల సేకరణ కేంద్ర భవనాలు, డిజిటల్ లైబ్రరీల భవనాల నిర్మాణ అంశాన్ని తొలగించారు. దీంతో అవన్నీ రద్దయినట్లు అయింది. కాగా గతంలో నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా ఉన్న పలు ప్రభుత్వ భవనాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సచివాలయ భవనాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య కేంద్ర భవనాలు వందల సంఖ్యలో జిల్లాలో అసంపూర్తిగా ఉన్నాయి. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు తగిన నిధులను విడుదల చేసి వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవలసి ఉంది.

9 గేమ్స్..9 విజయాలు..

(మొదటిపేజీ తరువాయి)

వారి ప్రతిభకు అధికారిక గుర్తింపు.

ఒంగోలు నుంచి సూరత్ వరకూ ప్రతిభ ప్రయాణం..

ప్రాజ్ఞిక తండ్రి రామ్‌నాథ్ ఒంగోలులోని పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్, ఏకేవీకే జూనియర్ కాలేజీ, సీఎస్ఆర్ శర్మ కాలేజీల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. తల్లి ప్రవీణ ఆదిత్య పబ్లిక్ స్కూల్, నాగార్జున జూనియర్ కాలేజీ, ఏకేవీకే జూనియర్ కాలేజీ, సీఆర్ రెడ్డి కళాశాలలో చదువుకున్నారు. ఉద్యోగరీత్యా ప్రస్తుతం కుటుంబం గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో స్థిర నివాసం ఉంటున్నారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ గౌరవం

డిసెంబర్ 26న ఢిల్లీలో జరిగిన ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రాజ్ఞిక అందుకోవడం ఆమె ప్రయాణంలో మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడే అవకాశం కూడా లభించింది. చిన్నారులతో సరదాగా మాట్లాడిన మోడీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు.

రాష్ట్రం నుంచి ప్రపంచం దాకా..

2023 నుంచి ఇప్పటి వరకు ప్రాజ్ఞిక నాలుగుసార్లు రాష్ట్ర ఛాంపియన్, జాతీయ స్థాయిలో కాంస్య పతక విజేతగా నిలిచి, పిన్న వయసులోనే చదరంగంలో అసాధారణ ప్రతిభను చాటింది.

ఒంగోలుకు గర్వకారణం..

ఒంగోలు గడ్డపై పుట్టిన బిడ్డ ఈ అరుదైన పురస్కారం పొందడం జిల్లావాసులకు గర్వకారణం. వాకా లక్ష్మీ ప్రాజ్ఞిక విజయం బాలికల క్రీడలకు నూతన దిశ చూపిస్తూ, చదరంగంలో భారత భవిష్యత్తుకు ఆశాజ్యోతిగా నిలుస్తోంది.

కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

జెండావిష్కరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆ పార్టీ ఆదివారం ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే ప్రయోజనం కలుగుతుందన్నారు. కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. బిజెపి కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటుదన్నారు. జాతి సంపద అంతా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తర్లుపాడు మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ రెహానాభాను, నాయకులు షేక్ అబ్దుల్లా, షేక్ ఖాశిం, షేక్ రబ్బానీ, ఇమ్రాన్, షేక్ అల్తాఫ్ పాల్గొన్నారు.

మద్దిపాడు : కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు కొనిజేటి గురుబాబు, బీసీసెల్ జిల్లా చైర్మన్ నట్టే సుబ్బారావు ఆధ్వరయంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొల్లా నాగార్జునకు మంత్రి స్వామి నివాళి

నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-మర్రిపూడి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కొల్లా శ్రీరాములు కుమారుడు కొల్లా నాగార్జున(32) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని ఆదివారం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వైద్యశాలలో నాగార్జున మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మాలకొండయ్య

ప్రజాశక్తి-కొండపి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కొండపికి చెందిన మాలకొండయ్య ను ఏకగ్రీవంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుమ్మల్ల సురేష్ బాబు, ఆర్.శ్రీను, ఎం.వీరయ్య, వెంకటేశ్వరరెడ్డి తదితరులు మాలకొండయ్యకు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీల పోరాటం స్ఫూర్తిదాయకం

(మొదటిపేజీ తరువాయి)

పండుగ' అనే నినాదాన్ని అంగన్‌వాడీలు ఆచరణలో చూపించారు.

ప్రజా సమూహాలతో ఉద్యమం..

ఈ ఉద్యమం అంగన్‌వాడీలకే పరిమితం కాలేదు. అంగన్‌వాడీల కుటుంబాలు, లబ్ధిదారులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టడం ద్వారా ప్రజల మద్దతు సాధించారు,

అణచివేతలు, ఒత్తిళ్లకు వెరవక..

ఉద్యమాన్ని అణచివేయడానికి అన్ని మార్గాలలో ప్రయత్నించారు. మార్కాపురంలో పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఛలో విజయవాడ సందర్భంగా వందలాది మందిని అరెస్టు చేసి, సుదూర ప్రాంతాలకు తరలించి అర్ధరాత్రి వదిలిపెట్టారు. కొంతమందిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని గృహ నిర్బంధం గావించారు.

జిల్లా అంతటా నిరసనల ఉధృతి

ఎమ్మెల్యేలకు అర్జీలు, ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మానవహారాలు, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం ఉద్యమం ప్రతి దశలో కొత్త రూపం తీసుకుంది. ఛలో విజయవాడకు వందల సంఖ్యలో హాజరై, రాష్ట్ర స్థాయిలో తమ డిమాండ్లను గట్టిగా వినిపించారు.

ఉద్యమ ఫలితాలు.. సంఘ బలోపేతం..

ఈ పోరాటం ఫలితంగా ప్రాజెక్టు కమిటీలు పునర్నిర్మాణం అయ్యాయి. కొత్త నాయకత్వం ఎదిగింది. బేస్తవారిపేట వంటి ప్రాజెక్టులలో కొత్త సంబంధాలు ఏర్పడ్డాయి. ఎన్నికల అనంతరం మినీ వర్కర్లకు ప్రమోషన్లు సాధించటం ద్వారా ఉద్యమం వృథా కాదని నిరూపితమైంది. జిల్లా, ప్రాజెక్టు మహాసభల ద్వారా సంఘం మరింత బలపడింది.

సిఐటియు పాత్ర.. రాష్ట్ర మహాసభలకు స్ఫూర్తి..

ఈ ఉద్యమంలో సిఐటియు అండగా నిలిచింది. జిల్లా కేంద్రం నుంచి రెండు దళాలుగా వెళ్లి అన్ని ప్రాజెక్టులలో నిరంతర పర్యవేక్షణ చేయడం, సమ్మె శిబిరాల్లో అంటిపెట్టుకొని ఉండటం, ప్రతి పిలుపును కార్యాచరణగా మార్చడం. అంగన్‌వాడీలకు ధైర్యాన్ని ఇచ్చింది. కార్మిక ఐక్యతకు స్పష్టమైన రూపం కనిపించింది.ఇది వేతనాల పోరాటం మాత్రమే కాదు. గౌరవం కోసం, భద్రత కోసం, భవిష్యత్తు కోసం సాగిన పోరాటంగా నిరూపితం అయింది. అంగన్‌వాడీల ఉద్యమ అనుభవాలు రాష్ట్ర మహాసభలకు స్ఫూర్తినిచ్చాయి. సీఐటీయూ జాతీయ మహాసభల వేళ, ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి స్ఫూర్తినిచ్చే అనుభవంగా నిలుస్తోంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం జిల్లాతో ప్రజలకు ప్రయోజనం : కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లాను అందరి కృషితో సాధించామని, జిల్లా రాకతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలగనుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక డ్రైవర్స్ కాలనీలో సాయంత్రం సిఎం చంద్రబాబుకు కృతజ్ఞత సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం ఉంటుందన్నారు. కలెక్టర్, ఎస్‌పితో పాటు ఉన్నతాధికారులంతా అందుబాటులో ఉంటారన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. మార్కాపురం జిల్లా ఇచ్చిన సిఎం చంద్రబాబుకు రుణపడి ఉండాలన్నారు. ఇక మిగిలింది వెలుగొండ ప్రాజెక్టు మాత్రమేనని, కూటమి ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేస్తామని చెప్పారు. అనంతరం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, టిడిపి నాయకులు మోరా వెంకటరెడ్డి, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు.

LOST OF PASSPORT

I,SAVARAM YASHWANTHA RAO S/o **SRINIVASARAO R/o Flat no 228 , 2nd floor mannam pride apartment Rama puram X road kothapet ,vetapalam Mandal bapatla District, Andhra Pradesh.** I have lost my original PASSPORT No. S5051466 on 24-12-2025 near Chirala RTC bus stand . If any person who traced the Passport contact. Savaram Yashwantharao Cell: 8074789613

పులి సంచారం

ప్రజాశక్తి-అర్ధవీడు : అర్ధవీడు మండలం దొనకొండ గ్రామ పరిధిలోని పొలాల్లో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత రెండు రోజులుగా రైతులు తాము సాగు చేసుకున్న మొక్కజొన్న, వరి, వివిధ రకాల పంటలను అడవి పందులు తిన్న రాత్రి సమయంలో పొలాల వద్ద కాపలా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పొలాలకు వెళ్లే రహదారిలో శనివారం పెద్దపులి అరుపులు వినిపించినట్లు రైతులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో పులి పాదముద్రలు కూడా ముద్రలు కనిపించడంతో అనుమానాలు బల పడ్డాయి. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 563/2025

కేలం భాస్కర్ రెడ్డి .. వాది

వర్సస్

మంచికంటి వెంకట రంగసుబ్బారాయుడు
అలియాస్ ఎం.వి.ఆర్.ఎస్. రాయుడు .. ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

మంచికంటి వెంకట రంగసుబ్బారాయుడు
అలియాస్ ఎం.వి.ఆర్.ఎస్. రాయుడు
తండ్రి శ్రీనివాసరావు, బేస్తవారిపేట గ్రామం,
బేస్తవారిపేట మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు దావాను దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు 30-12-2025వ తేదీ వాయిదా వున్నది. కావున మీరు వాయిదా రోజు ఉదయం గం. 10:30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ పి.యన్.శేషశయనారెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
అడ్వకేట్స్, గిద్దలూరు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన ఒంగోలు టౌన్, ఇస్లాంపేట నివాసం **సయ్యద్ ఖాదర్ సాహెబ్ గారి కుమారుడు సయ్యద్ అబ్దుల్ సత్తార్** అనువారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింట్ తేది 18-05-2005 ఒంగోల్ టౌన్, ఇస్లాంపేట నివాసం **షేక్ బషీర్ గారి భార్య మగ్బుల్ జాన్** నుండి ఒంగోల్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో డి.నెం.3579/2005 ద్వారా విక్రయ దస్తావేజు పొంది, ఆ ఆస్తిని సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్నాడు. సదరు విక్రయ దస్తావేజుకి లింక్ డాక్యుమెంట్ ద.నెం.**2795/1991** తేది.06-08-1991 అయి ఉన్నది. సదరు లింక్ డాక్యుమెంట్‌ను డి.నెం.**3579/2005** విక్రయ సమయ మందు మా క్లయింట్‌కి షేక్ మగ్బుల్‌జాన్ గారు చెందవేసినారు.

తేది 25-12-2025 ఉదయం 10-00 గం॥కు మా క్లయింట్ ఒంగోల్ బైపాస్ రోడ్డు నందు ఉడ్ కాంప్లెక్స్ దగ్గర గల రాంబాబు టీ స్టాల్ దగ్గర నుండి గుంటూరు రోడ్డు గుండా ఇంటికి పోవుచుండగా ఒరిజినల్ డి.నెం.**2795/1991** పోయినది. సదరు డాక్యుమెంట్ ఇంటికి వచ్చిన తరువాత పరిశీలించగా కనబడలేదు. సదరు డాక్యుమెంట్ కొరకు రాంబాబు టీ స్టాల్ దగ్గర ఎంత ప్రయత్నించినను ప్రయోజనం లేకపోయినది. పై డాక్యుమెంట్ ద్వారా ఎవరైనా అక్రమ లావాదేవీలు జరిపినను, సదరు లావాదేవీలు మా క్లయింట్ హక్కులను బధపరచజాలవు. మరియు అలాంటి వారిపై తగు చట్ట పరమైన చర్యలు తీసుకొనబడునని తెలియ జేయుటమైనది.

ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా డి.నెం.**2795/1991** తేది.06-08-1991 ఎవరికైనా ఒరిజినల్ దొరికిన యెడల దానిని మా యొక్క ఆఫీసుకు చేర్చగలరని తెలియజేయుటమైనది.

ఒంగోలు తేది :27-12-2025

ఇట్లు **విస్సా మస్తాన్ రావు,** M.A.,LLB
మారెళ్ల చంద్రశేఖర్, అడ్వకేట్స్
గ్రౌండ్ ఫ్లోర్, గోల్డన్ టవర్స్, జిల్లా కోర్టు ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా (ఏ.పి) -523001. సెల్ :9491315932

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కురిచేడు

యుటిఎఫ్ మండల మహాసభ సందర్భంగా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌వలి, అధ్యక్షుడిగా అన్యం శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడిగా డి.జానుబాబు, ఉపాధ్యక్షురాలుగా హిల్డా నైటింగేల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా బి.మాణిక్యరావు, గౌరవ సలహాదారులుగా సింగర్ లక్ష్మయ్య ఎన్నికయ్యారు.

దానియేలుకు సన్మానం

ప్రజాశక్తి - గిద్దలూరు

టిడిపి ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా గుర్రం దానియేలు నియమితులయ్యాడు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దానియేలును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు శానేశావలి, గిద్దలూరు సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాలఈశ్వరయ్య, పట్టణ ఉపాధ్యక్షులు పందీటి రజిని బాబు, కౌన్సిలర్లు లొక్కు రమేష్, బిల్లా రమేష్, బి. చంద్రశేఖర్, బిల్లా రమేష్, యామా సంజయ్, ఇజ్రాయేలు, లక్ష్మయ్య, నాయకులు ఉలాపు బాలచెన్నయ్య, మండ్ల శ్రీను, పసుపులేటి శ్రీనివాసులు, జిల్లెల్ల సంపత్ రెడ్డి, పిడతల రవితేజ, మద్దిలేటి, దూదేకుల దస్తగిరి, బొర్రా రాఘవేంద్ర పాల్గొన్నారు.

రామయ్య చౌదరికి సన్మానం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం ఎన్నూరు గ్రామానికి చెందిన గొర్రెపాటి రామయ్య చౌదరి టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. అందులో భాగంగా ఎఎంసి వైస్ చైర్మన్ మార్టూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు రామయ్య చౌదరిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటనపల్లి మాచర్ల, నాయకులు కోటేశ్వరరావు, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, కాలే మల్లికార్జునరావు, రావిపాటి వెంకట్రావు, రావిపాటి సుధాకర్, నల్లపు మాల్యాద్రి పాల్గొన్నారు.

వెండి బిందె బహూకరణ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ శివారులోని తర్లుపాడు రోడ్డులోనున్న శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానానికి రూ. రూ. 1.24 లక్షల విలువైన అష్టలక్ష్మి వెండి బిందెను హైదరాబాద్‌కు చెందిన నూకల మురళీకృష్ణ, సుజాత దంపతులు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ అర్చకులు దేవులపల్లి పవన్‌కుమార్‌శర్మ, ఆలయ సిబ్బంది ఆవుల వెంకటేశ్వర్లు, వెన్నా శ్రీధర్‌రెడ్డి, శివ, రంగనాయకులు అభినందించారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా నల్లూరి

ప్రజాశక్తి చీమకుర్తి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా నల్లూరి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా ఎనిమిదవసారి ఎన్నికైన నల్లూరి వెంకటేశ్వరరావుకు యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు టి.రోజారావు, చలువాది శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు ఎస్‌కె. ఖయ్యం బాషా, కోశాధికారి పి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడు శ్రీనివాస రావు, అధ్యక్షురాలు ఉమాదేవి అభినందనలు తెలిపారు.

మంత్రు నాయక్‌కు అభినందనలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి ఒంగోలు పార్లమెంట్ సెక్రటరీగా మంత్రు నాయక్, అధికార ప్రతినిధిగా పాలడుగు వెంకట కోటయ్య నియమితులయ్యారు. అందులో భాగంగా వారిని ఎఎంసి చైర్మన్ చేకూరి సుబ్బారావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చేకూరి సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షుడు పోట్ల గోవిందు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లపై

దిగజారుడు రాతలు సిగ్గుచేటు : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

వికలాంగుల పింఛన్లపై బ్లూ మీడియా దిగజారుడు రాతలు సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. వికలాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడేదనని తెలిపారు. పింఛన్ల కోసం జగన్ ప్రభుత్వం 5 ఏళ్లలో రూ.84 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం18 నెలల్లోనే రూ. 50 వేల కోట్ల ఖర్చు చేసినట్లు తెలిపారు. పింఛన్ల పెంపుపై మాట తప్పి, మడమ తిప్పి వికలాంగులను సైతం మోసం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులను పక్కన పెట్టి అనర్హులకు నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్లు ఇచ్చి ప్రభుత్వ సొమ్మును దిగమింగినట్లు ఆయన పేర్కొన్నారు. తప్పుడు రాతలు, అసత్య ప్రచారాలతో పత్రిక విలువలను స్తున్న వైసిపి బ్లూ మీడియాను ప్రజలు చీత్కరిస్తున్నారని మంత్రి స్వామి తెలిపారు.

ప్రతి బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -చీమకుర్తి

ప్రతి బుల్లెట్ లక్ష్యాన్ని ఛేందించేలా నైపుణ్యం సాధించాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. మండల పరిధిలోని పల్లమల్లి ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రక్రియ సాధనలో భాగంగా ఏర్పాటు చేసిన వార్షిక ఫైరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఫైరింగ్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫైరింగ్‌లో ప్రతి పోలీస్ అధికారి పాల్గొని మంచి మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఫైరింగ్‌కు సంబంధించి సందేహాలను నివత్తి చేసుకోవాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఆయుధాలపై పూర్తిస్థాయిలో తర్ఫీదు పొందాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల, ధన, మరియు ప్రాణ రక్షణకోసం ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను అభినందించి రివార్డ్స్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ, మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి. రమణ కుమార్, కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్, డిటిసి డిఎస్‌పి జి.గురునాథ్ బాబు, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫైరింగ్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

శింగరాయకొండలో భారీగా గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

రైలులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద 11.800 కిలోల గంజాయి, 33 సరాల గంజాయి చాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అందిన వివరాల ప్రకారం...బొకారో ఎక్స్‌ప్రెస్ రైలులో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఒంగోలు నుంచి శింగరాయకొండ వరకూ డాగ్ స్కాడ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. అనుమానంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి బ్యాగులను పరిశీలించారు. బ్యాగుల్లో 11.800 కేజీల గంజాయి, 33 సరాలా గంజాయి చాక్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం నాగ పట్టణం జిల్లా నివాసి ఆషిక్ ప్రధాన నిందితుడిగా గుర్తించారు. అనంతరం నిందితులను ఒంగోలు జిఆర్‌పి పోలీసులకు అప్పగించారు. జిఆర్‌పి ఎస్‌ఐ కె.మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ఎస్‌ఐ తీరును ఖండిస్తూ నేడు బంద్

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణానికి చెందిన ఎరువు వ్యాపారిపై ఎస్‌ఐ దాడికి నిరసనగా సోమవారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు తెలిపారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల వ్యాపారి యాదాల కోటేశ్వరరావు వారి కుమారుడు అవినాష్‌పై ఈనెల 24న పొదిలి ఎస్‌ఐ వి. వేమన లాఠీతో పాశవికంగా కొట్టినట్లు తెలిపారు. ఆయన తల్లిని నానా దుర్భాషలాడినట్లు తెలిపారు. అదే రోజు వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్ళిన సమయంలో అక్కడి నుంచి బలవంతంగా పోలీస్ స్టేషన్ కు తీసుకుని వెళ్లి నానా బూతులు తిట్టి అర్ధరాత్రి 12 గంటల వరకూ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. అందుకు నిరసనగా బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు, రాష్ట్ర వాసవి సేవాదళ్ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- అర్ధవీడు

బైకును బొలోరా వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గన్నేపల్లి- రంగాపురం గ్రామాల మధ్య రహదారిపై మూల మలుపు వద్ద ఆదివారం చవోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గన్నేపల్లి గ్రామానికి చెందిన రసూల్, ఖాసిం తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఖాసిం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పాడి గేదెలు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

రోడ్డు ప్రమాదంలో నాలుగు గేదెలు మృతి చెందాయి. ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మార్కాపురం-దేవరాజుగట్టు మార్గంలో (జాతీయ రహదారి 565)పై శనివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... రాత్రి 8:30 గంటల సమయంలో ఎనిమిది గేదెలు రహదారిపై అడ్డదిడ్డంగా పరిగెత్తాయి. వచ్చేపోయే వాహనాలను ఢీకొన్నాయి. చివరకూ నాలుగు గేదెలు మృతి చెందాయి. అదేసమయంలో బైకుపై పయాణిస్తున్న మార్కాపురం పట్టణానికి చెందిన సయ్యద్ సత్తార్ గేదెల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. సత్తార్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండంతో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శింగరాయకొండ

రైలు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శింగరాయకొండ రైల్వే స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 50 సంవత్సరాలు వయసు గలిగిన వ్యక్తి మృతిచెందినట్లు జిఆర్‌పి ఎస్‌ఐ కె.మధుసూదన్ రావు తెలిపారు. మృతుడు పచ్చ రంగు టీ షర్టు ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు. కుడిచేతిపైన శ్రీరామ అని,ఎడమ చేతి మీద పట్టపు వీరయ్య అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణంలోని శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ కాశి రావు ఆధ్వర్యంలో నరసరావు పేట శ్రేయ హాస్పిటల్ మరియు ఐవిఎఫ్ వారి ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి ఓపీ, స్కానింగ్ ఎరియు పురుషులకు వీర్యకణాల పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రేయ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ వసంత, హాస్పిటల్ సిబ్బంది మరియు ఐవిఎఫ్ వైద్య బృందం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండల పరిధిలోని గవదగట్ల పాలెంకు ఓ గిరిజనుడు కొమరగిరి ముత్యాలు అనారోగ్యంతో బాధ పడుతున్నారు. అందులో భాగంగా మానవత సంస్థ ఆధ్వర్యంలో ముత్యాలుకు ఆదివారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ గుంటక రామలక్ష్మమ్మ, సమితి సభ్యులు డాక్టర్ స్వర్ణ వెంకటేశ్వరరావు, మానవత కన్వీనర్ రత్నం. పాకల కోటేశ్వరరావు సిహెచ్.సుధాకర్ రెడ్డి. వెంకట సుబ్బారావు. మహంకాళి నరసింహ రావు, మారెళ్ళ లక్ష్మీనారాయణ, గుంజి రమణయ్య, తిరుపతి, సతీష్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి

పంగులూరులో మాట్లాడుతున్న మజుందార్

ప్రజాశక్తి - పంగులూరు

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. సిఐటియు మహాసభల ప్రచార జాత ఆదివారం పంగులూరు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక హక్కులు, ప్రభుత్వ ఆస్థులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే బిజెపి ప్రజాద్రోశ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, రేఖ ఎలిజిబెత్, వై సింగయ్య, లత, సురేష్, పి కిరణ్, సిఐటియు కార్యదర్శి మల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం మాజీ అధ్యక్షులు రాయిని వినోద్ బాబు, ఆదుం సాహెబ్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఈనెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖ పట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభల ప్రచార జాత ఇంకొల్లు పట్టణానికి వచ్చిన సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు మాట్లాడారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్, రేఖ ఎలిజిబిత్, సిఐటియు కార్యదర్శి నాగెండ్ల వెంకటరావు, రైతు సంఘం నాయకులు మాదాల అంజయ్య, కౌలు రైతు నాయకులు టి యేసయ్య, కె గంగయ్య, రంగారావు, డిఎన్ఎం కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అద్దంకి : విశాఖలో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలకు కార్మికులు తరలి రావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్ కోరారు. మహాసభల ప్రచారజాత స్థానిక బస్టాండ్ సెంటర్లో కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి తిరుపతిరెడ్డి, ఎం వసంతరావు, బి రేఖఎలిజిబెత్, వై సింగయ్య, బి లత, తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బల్లికురవ : కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు కోరారు. సిఐటియు కళాజాత బల్లికురవ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ ముజుందర్, ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, రేఖ ఎలిజిబెత్, వై సింగయ్య, బొంత వీరయ్య పాల్గొన్నారు.

చీరాల : సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. ఈనెల 28న బాపట్లలో ప్రారంభమైన ప్రచార జాతా చీరాల కూరగాయల మార్కెట్ వద్దకు చేరుకుంది. జాతాలో ప్రజానాట్య మండలి కళాకారులు లత, పి కిరణ్ బృందం పాటలతో కార్మికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి రేఖ ఎలిజిబెత్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, ఎన్ బాబురావు, జి ఇమ్మానియేలు, వై సింగయ్య, పి కాలేషా పాల్గొన్నారు.

పర్చూరు : సిఐటియు మహాసభల ప్రచార జాతకు స్థానిక బొమ్మల్ సెంటర్లో సిఐటియు నాయకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎర్రజెండాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మజుందారు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, ఎలిజిబిత్ రేఖా, ఎం డేవిడ్, సిఐటియు కార్యదర్శి కె శ్రీనివాసరావు, టి పేతురు, బి చినదాసు, చిమట వెంకటేశ్వర్లు, ఏసుబాబు పాల్గొన్నారు.

మార్టూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక హక్కులు తాకట్టు పెడుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం వసంతరావు, సిహెచ్ మజుందార్ అన్నారు. సిఐటియు జాతీయ మహాసభల జిల్లా ప్రచార జాత చీరాల నుండి బయలుదేరి ఆదివారం సాయంత్రం మార్టూరు చేరుకుంది. స్థానిక కూరగాయల మార్కెట్, పెద్దకానా దగ్గర సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, ఎం బాబు, రైతు సంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి, శేషాద్రి, బోడెంపూడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు పాల్గొన్నారు.

చీరాలలో మాట్లాడుతున్న సిహెచ్ మజుందర్

మార్టూరులో మాట్లాడుతున్న బత్తుల హనుమంతరావు

విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, చైర్మన్ గఫార్

క్రీడలతో ఐక్యత

ప్రజాశక్తి - కనిగిరి

క్రీడలతో స్నేహభావం, ఐక్యత పెంపొందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉగ్ర అన్న మెగా క్రికెట్ టోర్నమెంట్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ యూత్ అధ్యక్షులు అచ్చాల రవి, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, కొంగలేటి సూర్యనారాయణ రెడ్డి, అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నూతన షాపు ప్రారంభిస్తున్న నరేంద్ర వర్మ

రామరాజ్ కాటన్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో రామరాజ్ కాటన్ షాపు ఏర్పాటు చేయడం వ్యాపార పరంగా బాపట్ల మరింత అభివృద్ధి చెందుతుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో రామరాజు కాటన్ షాపును షాపు యజమానులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్ వద్ద బారులు తీరిన ప్రజలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వేకువ జాము నుండే వచ్చిన 1237 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. వైద్య శిభిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిశోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, కె లింగరాజు, మోహన్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

నేడు సుందరరాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - సిఎస్ పురం

శ్యాం సుందరరాజు

ప్రఖ్యాత పర్యాటక క్షేత్రమైన భైరవకోన ట్రస్టు బోర్డు చైర్మన్గా అంబవరం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ముప్పాళ్ళ శ్యామ సుందరరాజు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. చైర్మన్తో పాటు ట్రస్టు బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో జరిగే ప్రమాణ స్వీకారోత్సవంకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఫిబ్రవరి 5న జెఎసి రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - బాపట్ల

రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపైవిజయవాడలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న జరిగే ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో ఆదివారం జరిగిన ఎపి జెఎసి జిల్లా కార్యవర్గ సమావేశాని హాజరయ్యారు. జేఏసీ జిల్లా చైర్మన్ సిహెచ్ సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫిబ్రవరి 5న జరిగే మహాసభకు 92 శాఖల సంఘాల సభ్యులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టివి ఫణి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, విఆర్ఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోన ఆంజనేయకుమార్, ఎస్ మల్లేశ్వరరావు, జి అనుపమ, బ్రహ్మయ్య, టి రజనీకాంత్, బిటి వలి, పి రజని, ఎస్కె హాజరాబేగం, సుమన్, మురళి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శర్వాణి బయో ఫ్యూయల్ ప్రారంభం

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడు మండలంలోని తమ్మవరంలో శర్వాణి బయో ఫ్యుయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బి గోపాల్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.297 కోట్ల పెట్టుబడితో 14 ఎకరాల విస్తీర్ణంలో శర్వాణి బయోఫియల్స్ ఫ్యాక్టరీ స్థాపించినట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీలో ప్రత్యక్షంగా 100 మందికి, పరోక్షంగా 300 మందికి ఉపాధి లభిస్తున్నట్లు తెలిపారు. తమ ఫ్యాక్టరీ ఏడాదికి రూ.600 నుండి రూ.700 కోట్లు టర్నోవర్ ఉంటుందని తెలిపారు. రోజుకు 550 టన్నుల మొక్కజొన్న అవసరం అవుతుందని తెలిపారు. తద్వారా 2లక్షల లీటర్ల ఇంధనం

ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న ఎండి బి గోపాలరెడ్డి

తయారు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులు ప్రత్యక్షంగా మొక్కజొన్న పండించి ఫ్యాక్టరీకి తీసుకుని వచ్చి విక్రయంచేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు.

7 నుంచి రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

సంక్రాంతి సందర్భంగా సిఎస్ పురంలో జనవరి 7 నుంచి బిఎస్ఆర్ మెగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.1,00,116, రూ.70,116, రూ.50,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్ తదితర బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనవరి 6లోపు రూ.2వేలు ప్రవేశ రుసుం చెల్లించి తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు తోట చిన్న 96665 31005, గుడిపాటి నాగేశ్వరరావు 94413 25629 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి సైన్స్ఫెయిర్కు ఎంపిక

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం ఎడ్లపల్లి ఆలపాటి వెంకటరామయ్య జెడ్పి ఉన్నత పాఠశాల ప్లస్ టు విద్యార్థులు నిడమనూరి యశ్వంత్ సాయి కుమార్ తయారు చేసిన యాంటీ స్వీట్ అలారం ఫర్ డ్రైవర్ ప్రాజెక్ట్ ఎమర్జెన్సీ అండ్ సేఫ్టీ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందింది. రాత్రిపూట డ్రైవర్లు ఆరు సెకండ్లు నిద్రలోకి జారుకుని కనులు మూస్తే ఆటోమేటిక్గా అలారం మోగి వాహనం వేగం తగ్గించి సిగ్నల్ లైట్లు వెలుగుతూ డ్రైవర్ను అప్రమతం చేస్తుంది. ఈ ప్రాజెక్టుకు ఉపాధ్యాయులు నెమలికంటి ప్రసాద్ బాబు గైడ్ చేశారు. ఆటో ట్యాంపరింగ్ ల్యాబ్ మోటర్ పి విజయ రత్నం, ఒకేషనల్ డ్రైవర్ జాన్ వెస్లీ, ప్రవీణ్ సహకరించారు. డిసెంబర్ చివరిలో రాష్ట్రస్థాయిలో సైన్స్ పోరంకు ప్రాజెక్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ సతీష్, రవి శ్యాంబాబు, అలపర్తి శ్రీనివాసరావు, కుర్ర శ్రీనివాసరావు అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

విద్యతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి - కనిగిరి

రాష్ట్రస్థాయి మహిళల కోకో పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు విజయంలో ప్రతిభను చాటిన క్రీడాకారులను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటేలా క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్ బి కాశీ విశ్వనాథరెడ్డిని ప్రశంసించారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

అప్పలరాజుపై పీడీ యాక్ట్ దుర్మార్గం

ప్రజాశక్తి-చీమకుర్తి

ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి విశాఖపట్నం జైలుకు పంపినందుకు నిరసనగా రైతు సంఘం మరియు సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం నిసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజును పీడీ యాక్ట్ కింద అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యని తెలిపారు. అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీని పెట్టవద్దని ప్రజలు ఆందోళన చేస్తుంటే, ఆందోళనకు మద్దతు తెలుపడం తప్పుగా భావించి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈపాటికి ఆ ప్రాంతంలో రసాయన ఫ్యాక్టరీలు పెట్టడం వల్ల నీరు కలుషితమై ప్రజల అల్లాడుతున్నట్లు తెలిపారు. మరోవైపు ఇంకా ఫ్యాక్టరీలు పెడితే తామ బతకలేయమని ప్రజలు బయటికి వస్తే వారిని అర్థం చేసుకోవడానికి సిద్ధపడకపోగా, ప్రజా పోరాటానికి మద్దతు ఇచ్చిన నాయకులను అరెస్టు చేయడం, పీడీ చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ప్రజా ఉద్యమాలపై పీడీయాక్టి పెట్టకూడదని, ఉద్యమాలను అణిచివేయడాన్ని ప్రజలు ఏమాత్రం సహించరన్నారు. ప్రజలకు కంటకమైన దుర్మార్గమైన పనులు, మనుషుల కిడ్నాప్, గంజాయి మాఫియాలపై విధించాల్సిన పీడీ చట్టాలను ప్రజా ఉద్యమాల నాయకులుపై పెట్టడం ఈ ప్రభుత్వం యొక్క దుర్మార్గతను తెలియజేస్తుందన్నారు. నెల్లూరులో గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న పెంచలయ్యను హత్య చేసిన హంతకులపై పీడీ యాక్ట్ పెట్టలేదన్నారు. ప్రజల తరఫున పోరాటం చేస్తున్న నాయకులపై పీడీ యాక్ట్ ప్రయోగించడం ప్రజలు ఏమాత్రం సహించరని తెలిపారు. ప్రజా ఉద్యమాలు ఇంకా ఉధృతం కాకముందే అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకుడు పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కాలరాస్తూ, పేద ప్రజల సమస్యల మీద పోరాడుతున్న నాయకులు ఈ చట్టాలను ప్రయోగించడం ప్రజలు ఏమాత్రం సహించరని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా అన్ని వర్గాలు ఐక్యంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరిసురేష్, బెజవాడశ్రీనివాసరావు, ఎస్.ఆదినారాయణ, కుమ్మెత శ్రీనివాసులు రెడ్డి, క్రిష్టిపాటి శ్రీనివాసరెడ్డి, నల్లూరి కృష్ణయ్య, పమిడి నరసింహారావు, మూలే రామాంజనేయరెడ్డి, ఏడుకొండలు, పులి ఓబుల్ రెడ్డి, తొట్టెంపూడి రామారావు, నుగ్గు శ్రీను పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతు సంఘం, సిఐటియు నాయకులు

అక్రమ రొయ్యల చెరువును నిలుపుదల చేయాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న రొయ్యల చెరువును వెంటనే నిలుపుదల చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న రొయ్యల చెరువును రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె. జయంతిబాబు మాట్లాడుతూ కనపర్తి రెవెన్యూ పరిధిలోని 76 సర్వేనెంబరులో దేవరంపాడు గ్రామినికి చెందిన సింగోతు ఏడుకొండలు ,నాయుడు శ్రీను, వడ్లమూడి శ్రీను మరో 20 మంది రైతులు మాగాణి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆ భూములకు ఆనుకొని సింగోతు బ్రహ్మయ్య అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చెరువు సాగులోకి వస్తే నీరు కలుషితం అయి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అనుమతులు లేకుండా కట్ట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందువల్ల మాగాణి భూముల నుంచి మురుగు నీరు బయటకు పోయే మార్గం లేకుండా పోయిందన్నారు. దీనివల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. అనుమతులు లేకుండా రొయ్యల సాగు చట్టవిరుద్ధమని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి.శ్రీకాంత్ ,రావెళ్ళ వెంకట్రావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ఎంఇఒ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అవసరమైన అన్ని అధ్యయన సామగ్రిని ముందుగానే అందజేసినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు సాధన పుస్తకాలు, మోడల్ ప్రశ్నపత్రాలు, అధ్యాయాల నోట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. పరీక్షల దష్ట్యా విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులను నిరంతరం గైడ్ చేస్తూ, స్టడీ మెటీరియల్‌ను సమర్థవంతంగా వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు మెటీరియల్‌ను క్రమం తప్పకుండా చదివి, సందేహాలను ఉపాధ్యాయుల వద్ద నివత్తి చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -కొండపి

దామచర్ల సత్య యూత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు నేతి రవికుమార్ తెలిపారు. కీర్తిశేషులు, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు, కీర్తిశేషులు బోదాటి సోమయ్య నాయుడు జ్ఞాపకార్థం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మంత్రి స్వామి , మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9121463338, 9866170781 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రన్‌వేను నిలుపుదల చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమళ్ల, కలికివాయి మధ్యలో జాతీయ రహదారిపై రన్‌వేను నిలుపుదల చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఆ ప్రాంత గ్రామస్తులు ఆదివారం వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రన్‌వేను నాసిరకంగా నిర్మించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విమానాల భద్రత, ప్రమాదాలు, పర్యావరణ నష్టం అదన-భూసేకరణ , అధిక వేగం మరియు ప్రజాధనం వథా కారణంగా రన్‌వేను నిలుపుదల చేయాలని కోరారు. విమానాల లాండింగ్ కోసం నిర్మించిన సిమెంట్ రోడ్డుపై అనేక మలుపులు ఉన్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకల కారణంగా సిమెంట్ రహదారిపై పగుళ్లువచ్చి గుంతలు ఏర్పడినట్లు తెలిపారు. నిర్మాణం జరిగిన రెండు సంవత్సరాలకు ఇలా జరిగితే బరువైన విమానాలు దిగితే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వాలు ఆలోచించుకోవాలని కోరారు. మరొక 11.25 హెక్టార్ల భూసేకరణ కలిపి సుమారు 28 ఎకరాల భూమిని సేకరించి ప్రాజెక్టుకు సముద్రానికి 10 కిలోమీటర్ల పరిధిలోకి విస్తరించడం వల్ల పర్యావరణానికి తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం సమయంలో ఎలాంటి ప్రభుత్వ నిబంధనలను పాటించలేదని తెలిపారు. గ్రామసభలు నిర్వహించలేదని మంత్రికి వివరించారు. రన్‌వే నిర్మాణం జరిగిన ప్రాంతంలో పక్షులు సంచారం ఉందన్నారు. ఆ పక్షులు విమాన ప్రమాదాలకు కారణం అవుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో తీర ప్రాంతంతో పాటు నీటి వనరులు, వ్యవసాయ పొలాలు అధికంగా ఉన్నట్లు తెలిపారు. దేవాలయాల పంట పొలాలు, పశు సంరక్షణకు అధికంగా నష్టం జరుగుతుందని వివరించారు. ప్రస్తుతం రన్‌వేపై రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో ఆలోచించి రన్‌వే ప్రాజెక్టును తక్షణమే నిలిపివేసే విధంగా సహకరించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బిఎన్

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చీకుమర్తి

ప్రజాశక్తి 2026 నూతన క్యాలెండర్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మద్ది పాడు ఎఎంసి చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందిమల్ల గంగాధర్ రావు, టిడిపి నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు ,యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి సుబ్బారావు, గోరంట్ల చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ వై.రామకష్ణయ్య, ప్రజాశక్తి బ్యూరో ఎస్‌వి. బ్రహ్మం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు కొప్పర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిద్దలూరులో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరులో...

ప్రజాశక్తి - గిద్దలూరు

ప్రజాశక్తి 2026 నూతన క్యాలెండర్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాబుతూ ప్రజా సమస్యలపై ప్రజాశక్తిలో నిత్యం కథనాలు వస్తుంటాయన్నారు. ప్రజా సమస్యలు ఉన్న చోట ప్రజాశక్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జి బి.పూర్ణ చంద్రరావు,గిద్దలూరు విలేకరి ఎం. శేషగిరి, టిడిపి నాయకులు నంది శ్రీనివాసులు, 2వ వార్డు కౌన్సిలర్ బి.చంద్రశేఖర్ యాదవ్, ఉలాపు బాలచెన్నయ్య, అబ్బు ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

దోర్నాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాలలో..

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను టిడిపి యర్రగొండ పాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్‌కో ఆర్డినేటర్ అల్లు వీరారెడ్డి, పెద్దదోర్నాల విలేకరి కంభాలపల్లి చంద్రశేఖరరెడ్డి, మార్కాపురం విలేకరి వెన్నా శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు కొప్పుల సుబ్బారెడ్డి, దొడ్డా శేషాద్రి, చంటి, దొడ్డా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి- కొండపి

కొండపి మండలం పెట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు రూ. 40.000 విలువైన ఆర్‌ఒ ప్లాంట్‌ను ఎ. రాధాకష్ణ బహుకరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు సురేఖ. రామారావు దాత రాధాకష్ణను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు కందిమళ్ల లక్ష్మీనారాయణ ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సామ్యూల్, పాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసశర్మకు నివాళులర్పిస్తున్న ఆనందబాబు

గోవాడ అర్చకులు శ్రీనివాసశర్మ మృతి

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని గోవాడ బాల కోటేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆరోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని శ్రీనివాస శర్మ నివాసానికి వెళ్లి మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ దైవసేవకు అంకితమై భక్తుల మనసుల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు ప్రశాంత్

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

కాంగ్రెస్ ఆవిర్భవించి 141వ సంవత్సరాల సందర్భంగా దర్శి గడియారం స్తంభం సెంటర్ కాంగ్రెస్ జెండాను నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కొడవటికంటి ప్రశాంత్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సిరివెల్లి పౌల్ యేసు, కాంగ్రెస్ అభిమానుల అధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని యనమదలకు చెందిన కొలసాని ప్రసాదరావు (76) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. పిడుగురాళ్ళ, వాడరేవు జాతియ రహదారిపై పసుమర్తి సమీపంలో ఆదివారం ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతుడు యనమదల నుండి చిలకలూరిపేట తన ఎక్సెల్ వాహనంపై వేళ్ళుచుండగా బొలెరో వాహనం దీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు చెప్పారు.

వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

అభయాంజనేయ స్వామికి ఆభరణాలు బహూకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన దాతల బృందం విశ్రాంత ఉపాధ్యాయులు గొడవర్తి మల్లికార్జునరావు, దాసరి భాస్కరరావు, పడమట రమాకుమారి, వృత్తి విద్యా ఉపాధ్యాయుడు రామారావు, పులి కార్తీక్ స్థానిక బస్టాండు సెంటర్లోని అభయాంజనేయ స్వామికి రూ.50 వేల విలువైన ఆభరణ సామగ్రి వితరణ చేశారు. ఆలయ ట్రష్టి మోర్ల ప్రసాద్ దాతల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి వారి అభయ హస్తం, కిరీటం, కర్ణ పత్రాలు, వక్షస్థల కవచం, హస్త గద, లోహపు తోక అందజేసినట్లు ఆలయ పూజారి తెలిపారు. సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలంలో స్వామివారికి అలంకరింప చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతల బృందంతో పాటు దేవాలయ ట్రస్ట్ వరల ప్రసాదు, ఆలయ పూజారి బృందం సత్యనారాయణ చార్యులు, కొత్తపేటలోని కెవి హోమియో వైద్యశాల వైద్యులు కె శివరామకృష్ణ పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయకులు, సభ్యులు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో యుటిఎఫ్ మండల కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, టి రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ జి కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జి విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి వీరాంజనేయులు సంఘం నిబంధనావలి, హక్కులు, బాధ్యతలు, కార్యకర్తలు, విధి విధానాలు కార్యకర్తలకు వివరించారు. ఎన్నికల అధికారి ఎస్ రవి మాట్లాడుతూ దర్శి మండల శాఖ అద్భుతంగా పని చేసిందని తెలిపారు. మండల గౌరవ అధ్యక్షులు వి రామిరెడ్డి, అధ్యక్షులు కె శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె రామారావు, సహాధ్యక్షులు ఎస్ ఏడుకొండలు, సహాధ్యక్షురాలు ఎల్ఆర్ స్రవంతి, కోశాధికారి జె రవికుమార్, మహిళా కార్యదర్శులు అరుణకుమారి, బొగ్గవరపు జ్యోతి, కార్యదర్శులు ఆదిశేషయ్య, నరసింహారావు, శ్రీనివాస రావు, రోశయ్య, విజయ్ భాస్కర్, రవిచంద్ర, తిరుపతి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సతీష్‌బాబు, వీరాంజనేయులు, మహిళా కమిటీ కన్వీనర్ ధనలక్ష్మి, కో కన్వీనర్ నరసమ్మ, సభ్యులు పద్మావతి, ఆడిట్ కమిటీ రామాంజనేయులు, కష్ణారెడ్డి, సాంస్కృతిక కమిటీ సత్యవాణి, పద్మశ్రీ, కమిటీ కన్వీనర్ మస్తాన్‌వలి, కో కన్వీనర్ శానుల్లషా, కుటుంబ సంక్షేమం కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, కో కన్వీనర్ సుబ్బారావు, పత్రికా కమిటీ కన్వీనర్ సుబ్బారావు, కో కన్వీనర్ పి వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్స్ రామారావు, ప్రసాదరావు, రంగారావు, చెంచయ్య, మారుతీ కిరణ్‌రెడ్డి, అల్లభకష్ మీరా, సత్యవతి, అనసూయ, వెంకటేశ్వర్లు, రామారావు, శ్రీనివాసరావు, ఖాసిం ఎన్నికయ్యారు.

పీసీపల్లి : ఒంగోలులో ఆదివారం జరిగిన యుటిఎఫ్ విస్తృతస్థాయి సమావేశంలో నూతనంగా ఏర్పాటు కానున్న మార్కాపురం జిల్లాకు మండలంలోని గుంటుపల్లి జడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయులు ఎ పోతులూరయ్య మార్కాపురం జిల్లా కార్యదర్శిగా, పెద ఇర్లపాడు జడ్పీ హైస్కూల్లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్ ఏసుబాబు సిపిఎస్ కన్వీనర్, పెద అలవలపాడు హైస్కూల్లో గణిత ఉపాధ్యాయులు జిలానీ ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

మృతి చెందిన ప్రశాంత్

ప్రజాశక్తి -బల్లికురవ

బల్లికురవ, చెన్నుపల్లి రోడ్డులో ద్విచక్ర వాహనంపై నుండి పడి యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన అమర్తపూడి ప్రశాంత్ (18)కు ఐదు నెలల క్రితం సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెంకు చెందిన యువతీతో వివాహం చేశారు. రాత్రి 10 గంటల సమయంలో బల్లికురవ, చెన్నుపల్లి రోడ్డులోని పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకుని మక్కినవారిపాలెం అత్తగారింటికి బయలు దేరాడు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆదివారం తెల్లవారు జామున రోడ్డు పక్కనే ఉన్న కాలువలో ద్విచక్ర వాహనంతో పాటు ప్రశాంత్ పడిపోయి ఉన్నాడు. ద్విచక్ర వాహనానికి ఏ విధమైన దెబ్బలు లేకపోవడం, మక్కెనవారిపాలెం వెళ్లేందుకు బయలుదేరిన యువకుడు బల్లికురవ వైపు వాహనంతో పాటు పడిపోయి ఉండటం, కుటుంబ సభ్యులను అనుమానాలకు గురిచేసింది. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులు ప్రమాదాన్ని గుర్తించి 108కు సమాచారం అందించారు. ప్రశాంత్ అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ భవన్లో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 250 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ తెలిపారు. చీరాల అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ సౌజన్యంతో కొల్లా సాకేత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లా శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతుల ఆర్థిక సహాయంతో నిర్వహించారు. శిభిరంలో హాస్పిటల్ ఎండి డాక్టర్ డి రవి కిరణ్, డాక్టర్ డి నిరుపమ పర్యవేక్షణలో ఆరుగురు డాక్టర్ల బృందం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ యూనిట్ హెడ్ గోవర్ధనరెడ్డి, రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, కోశాధికారి పంబి సదానందారెడ్డి, నాగబైరు శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, భవనం రాజగోపాలరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, తేళ్ల రమేష్ చంద్ర, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కాసా అశోక కుమార్, కోట హరిప్రసాదరావు, కోట శ్రీనివాసరావు, ఎజిజికె రెడ్డి, పాబోలు వెంకటేశ్వర్లు, మున్నంగి వెంకట సుబ్బయ్య, ఎల్ లక్ష్మణరావు, దండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకులకు శక్తి టీంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న శక్తి టీం బృందం

ప్రజాశక్తి - చీరాల

ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మోయిన్ సూచనలతో సెవెన్త్ సెన్స్ బీచ్, రివైర బీచ్ ప్రాంతాల్లో శక్తి టీం కానిస్టేబుల్ కె సుబ్బారావు నేతృత్వంలో అవగాహన కల్పించారు. చిలకలూరిపేట నుంచి వచ్చిన యాత్రికులతో మాట్లాడారు. సముద్ర స్నానం సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై వివరించారు. అనంతరం సముద్రంలోకి వెళ్లవద్దని చెప్పారు. భోజనం చేసి భద్రంగా స్నానం పూర్తి చేసుకోవాలని సూచించారు. బీచ్ ఒడ్డునే ఉండటం మంచిదని, సెల్‌ఫోన్లు, లగేజీ వంటి విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు.

డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న బొలిశెట్టి శ్రీనివాసరావు

బొలిశెట్టికి డాక్టరేట్ అవార్డు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నీతి ఆయోగ్ అమోదించిన మనం ఫౌండేషన్ హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో బొలిశెట్టి శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారు. సామాజిక అభ్యున్నతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అవార్డు ఇచ్చినట్లు తెలిపారు. ఫ్రాంకలిన్ టెక్ సిఇఒ అర్ శివకుమార్, ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు రేలంగి నరసింహారావు, మనం ఫౌండేషన్ ఆర్గనైజర్ డాక్టర్ చక్రవర్తి చేతుల మీదగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అవార్డు పొందిన బొలిశెట్టి శ్రీనివాసరావును రామనాథం రామకృష్ణ, లక్కరాజు రాధాకృష్ణమూర్తి, అప్పారావు, సాంబశివరావు, వంగర బాబుజి అభినందించారు.

త్రిమూర్తులును సన్మానిస్తున్న దృశ్యం

త్రిమూర్తులు కృషితో గ్రంథాలయ భవనం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని చిన్ని శాంతయ్య మినీ ఫంక్షన్ హాలులో ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ మూర్తులు మధురస్మృతులు సభకు అన్నమనేని వెంకటరావు అధ్యక్షత వహించారు. ఎపి వ్యవసాయ మిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసినారు. పట్టణంలో గ్రంధాలయంకు సొంత భవన నిర్మాణ స్థల సేకరణకు పోరాటం చేసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో విజయం సాధించిన మన్నం త్రిమూర్తులు పోరాట యోధుడని అన్నారు. సినీ దర్శకులు కె బాలచందర్ సినీ జీవిత విశేషాలు సినీ విశ్లేషకులు ఆర్‌వి రాఘవరావు వివరించారు. కార్యక్రమంలో పిసిహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, డాక్టర్ యు దేవపాలన, నీలంరాజు నాగేశ్వరరావు, గాడేపల్లి దివాకర్ దత్తు, వారణాసి రఘురాం శర్మ, పుట్టమరాజు శ్రీరామచంద్రమూర్తి, పంతంగి ఆంజనేయులు, నరసింహారావు, మల్లాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నారకొండను దర్శించుకున్న భక్తులు

ప్రజాశక్తి - సిఎస్ పురం

మండలంలోని నారకొండలో వెలిసిన నారాయణస్వామి ఆలయంలో భక్తులు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం చేశారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఎవరైనా ఏదైనా కులం, మతం, రాజకీయ పార్టీ లేదా వర్గాన్ని అవమానించేలా లేదా కించపరిచేలా వ్యాఖ్యలు, సందేశాలు, ఫోటోలు లేదా వీడియోలు ట్విట్టర్, ఫేసుబుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రాం లేదా ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫారంలలో పోస్ట్ చేసినా, షేర్ చేసినా లేదా వాటికి సహకరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ వైవి రమణయ్య తెలిపారు. సోషల్ మీడియా గ్రూప్‌ల అడ్మిన్లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడి పందేలపై నిషేధం

ప్రజాశక్తి - ఇంకొల్లు

పేకాట, కోడి పందేలకు వెళ్లిన, నిర్వహించిన, ప్రోత్సహించిన, ఆడిన వారిపై కేసులు నమోదు చేస్తామని సిఐ వైవి రమణయ్య తెలిపారు. వీటికి సంబంధించి ఏ విధమైన అనుమతులు లేవని ప్రజలు గమనించలని అన్నారు. జనవరి 1న బహిరంగ మద్యం సేవించిన, అవాంఛనీయ సంఘటనలు చేసిన సహించేది లేదని హెచ్చరించారు. చీరాల డిఎస్పి 91211 02140, ఇంకొల్లు సిఐ91211 02147, ఇంకొల్లు ఎస్ఐ 91211 02148, చినగంజాం ఎస్ఐ 91211 02149, కారంచేడు ఎస్ఐ 91211 02145 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజాశక్తి
సోమవారం 29 డిసెంబర్ 2025

బురదలోనే మృతదేహాన్ని తీసుకెళుతున్న దృశ్యం

శ్మశానవాటికకు రోడ్డు లేక అవస్థలు

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని అడవులదీవి పరిధిలోని భీమావారిపాలెం శ్మశాన వాటికకు వెళ్లే దారి దుర్భరంగా మారి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన రేమాల వీరాస్వామి మృతి చెందడంతో ఆయన మృత దేహాన్ని స్మశానవాటికకు తీసుకెళ్లేందుకు దారి లేక గ్రామస్తులు నీళ్లలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామం నుంచి స్మశానవాటిక వరకున్న రోడ్డు బురద మయంగా ఉండటంతో మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ వెళ్లారు. ఈ దృశ్యం చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. గత కొన్నేళ్లుగా గ్రామంలో ఇదే దుస్థితి ఉన్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశానవాటికకు శాశ్వత రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జెసి భావన

గవర్నర్‌కు అధికారుల స్వాగతం

ప్రజాశక్తి - బాపట్ల

కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటనలో భాగంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం మండలంలోని పాండు రంగాపురం సూర్యలంక బీచ్ గోల్డెన్ సాండ్స్‌కు చేరుకున్నారు. గవర్నర్‌కు జాయింట్ కలెక్టర్ భావన స్వాగతం పలికారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు, ఆర్డీఓ పి గ్లోరియా, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ, తహశీల్దారు షేక్ సలీమా, డిఎస్పీలు రామాంజనేయులు, జగదీష్ నాయక్ ఉన్నారు.

టిడిపి నాయకుడు కూరపాటి మృతి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం కొత్త నారికేళ్లపల్లిలో తెలుగుదేశం సీనియర్ నాయకులు కూరపాటి గోపి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు గ్రామానికి చేరుకొని గోపి మృత దేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పామూరు

పట్టణంలోని కనిగిరి రోడ్డు వద్ద చెరువు పక్కనే అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంపై దృష్టిపెట్టి జెసిబి ద్వారా ఆదివారం చెత్త తొలగించారు. శాసన సభ్యులు డాక్టర్ ఉగ్ర ఆదేశాల మేరకు చెరువు కట్ట పక్కనే వ్యర్థ పదార్థాలు తొలగిస్తున్నట్లు తెలిపారు. చెరువు కట్టవద్ద చెత్త వేస్తే రూ.5వేలు అపరాధ రుసుం విధిస్తామని, పోలీసు కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఆమె వెంట చెరువు చైర్మన్ పాలపర్తి రమణయ్య, టిడిపి మాజీ అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు, ఎఎంసి వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, మెంట నర్సింహారావు, గరికిపాటి వెంకట్రావు ఉన్నారు.

సంస్కృతిని పరిరక్షించాలి

ప్రజాశక్తి - బాపట్ల

సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషనర్ జి రఘునాధరెడ్డి అన్నారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన 'ఆనంద ఆదివారం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిపిఓ సర్వేపల్లి మల్లిఖార్జునరావు, ఆర్ఐ శివరామ కృష్ణ, చేవూరి కరుణ, గొలపల శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి నారాయణ భట్టు, నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంద్రెయ పాల్గొన్నారు.

కక్ష సాధింపులు ఉండవు : ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి - కనిగిరి

తాను కక్ష సాధింపు రాజకీయాలు చేయనని, వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధి అజెండాగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్లో వెలిగండ్ల ఎంపీపీ రామన మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎర్రబోయిన భారతి, మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి, వైసీపీ నాయకులు నాగూర్ యాదవ్, కొటాలపల్లి సర్పంచ్ భాస్కరరెడ్డితోపాటు 160 కుటుంబాలు వైసిపిని వీడి ఆదివారం టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త, పాత లేకుండా ఐక్యంగా మన ప్రాంత అభివృద్ధి, మన బిడ్డల భవిష్యత్తు కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేసి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎంఎస్ఎంఈ, బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.173 కోట్లతో మున్సిపాలిటీలోని ప్రజలకు మంచినీళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.250 కోట్లతో కనిగిరి, పీసీపల్లి మండలాలకు తొలి విడతగా వెలుగొండ జలాలు ఇస్తున్నట్లు తెలిపారు. రైల్వే లైన్ నిర్మాణ పనులు ఆగి ఉండగా తిరిగి చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాల తోపాటు గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2014 నుంచి పెండింగులో ఉన్న బైపాస్ రోడ్డు పూర్తి చేశామన్నారు. ఈ ప్రాంతం నుంచి వలసలు లేకుండా ఉద్యోగాలు చేస్తూ సంతోషంగా బిడ్డలు జీవనం సాగించాలనే కృత నిశ్చయంతో పనిచేస్తున్నానని అన్నారు. ఎవరైతే కనిగిరిని అభివృద్ధి చేయగలరో ఆలోచించి ఆ

ఉగ్ర సమక్షంలో వైసీపీ నుంచి టిడిపిలో చేరిన నాయకులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సమర్థవంతమైన సిఎం చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ సారధ్యంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. సీఎం అయ్యే అవకాశం వచ్చినప్పటికీ సీనియర్ నేత పాలన సాగితే రాష్ట్రం బాగుపడుతుందని త్యాగం చేసిన పవన్ కళ్యాణ్ సహకారం మరువలేనిదని అన్నారు. పార్టీలో చేరిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వెలిగండ్ల మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలో ప్రత్యేకంగా చేసిన అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారథ్యంలో నడవాలని నిర్ణయించుకుని చెప్పారు. గతంలో ఉగ్రనరసింహారెడ్డి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చేశారని అన్నారు. ఈరోజు తమతోపాటు కొట్టాలపల్లి, అగ్రహారం గ్రామాల నుంచి భారీగా టిడిపిలో చేరడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వెలిగండ్ల టిడిపి అధ్యక్షులు కె ఇంద్రభూపాల్‌రెడ్డి, టిడిపి నాయకులు పల్లాల నారపరెడ్డి, ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి, దొడ్డ వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కష్టపడితే సిఫార్సు లేకుండా పదవులు వరిస్తాయి

ప్రజాశక్తి- కనిగిరి

పార్టీ కోసం కష్టపడితే సిఫార్సులతో పని లేకుండా పదవులు వరిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో చురుకుగా పని చేసిన టిడిపి శ్రేణులకు ప్రభుత్వం గుర్తించి పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించగా ఆ మేరకు ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు. గతంలో ఎమ్మెల్యే సిఫార్సుల మేరకు పార్టీ శ్రేణులకు పదవులు వచ్చేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. కష్టపడి పని చేసిన వారికే నేరుగా పదవులు వరిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, యూత్ అధ్యక్షులు అచ్చాల రవి, టిడిపి మండల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, బాలు ఓబులురెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, కొంగలేటి సూర్యనారాయణరెడ్డి, అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మెతకుల శ్రీనివాసులు, నంబుల కొండయ్య, ఐటీసీ శ్రీనివాసులు, బి రామసుబ్బారెడ్డి, చీర్ల నాగార్జున యాదవ్, జిలాని, రహిమాన్, బుల్ల బాల బాబు పాల్గొన్నారు.

సిఎస్ పురం : సుపరిపాలనలో తొలి అడుగులో కృషి చేసిన కార్యకర్తలకు అభినందిస్తూ మంత్రి లోకేష్ ఉత్తమ కార్యకర్తలుగా గుర్తించి ప్రశంసా పత్రం, మెమొంటో అందజేయాలని సూచించారు. మండలంలోని ఆర్‌కెపల్లికి చెందిన టిడిపి నాయకులు, యూనిట్ ఇన్చార్జి చావా శేఖర్‌కు ఉత్తమ కార్యకర్తగా గుర్తింపు లభించింది. కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు.

సిఎస్‌పురం రూరల్ : మండలంలోని ఆర్‌కెపల్లికి చెందిన చావా చంద్రశేఖర్ ఉత్తమ టిడిపి కార్యకర్తగా ప్రశంస పత్రం ఎంఎల్ఎ ఉగ్రనరసింహారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. మండలంలోని 9 మంది కార్యకర్తలు ప్రశంసలు అందుకున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి యువకుడు మృతి

ప్రజాశక్తి - వేమూరు

ఎరువుల లోడుతో ట్రాక్టర్‌లో పొలానికి వెళుతున్న సమయంలో క్రిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌కు తగలడంతో యువకుడు మృతి చెందాడు. కుమారుని మృతిని తట్టుకోలేని తండ్రి వెంకయ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బేతేలు పురం లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అట్లూరు సునీల్ మొక్కజొన్న పంటకు ఎరువులను ట్రాక్టర్‌తో శనివారం తరలిస్తున్నాడు. రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ట్రాక్టర్ పొగగొట్టడానికి తగిలాయి. దీంతో ట్రాక్టర్‌కు విద్యుత్తు సరఫరా కావటంతో షాక్‌కు గురై ట్రాక్టర్ నడుపుతున్న అట్లూరి సునీల్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి బలైన నిండు ప్రాణానికి న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సునీల్ భార్య ప్రస్తుతం నిండు గర్భిణీతో ఉంది. మృతి సమాచారంపై విచారణ చేసేందుకు రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి, తహశీల్దారు సుశీలతో కలిసి ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాల్లో

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఆర్డీఒ రామలక్ష్మి

పోస్టుమార్టం నిమిత్తం తరలించిన మృతదేహాలను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

రైతులు పంట పొలాల్లో వెళ్లే ప్రధాన రహదారుల్లో సైతం వైర్లు క్రిందకి వేలాడుతున్నాయని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం వలననే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేడు రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని ఆరోపించారు. ఇలాంటి నిర్లక్ష్య అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు

ప్రజల సంక్షేమమే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - మార్టూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా పేదల గడపకు చేరాలనే లక్ష్యంతో టిడిపి ప్రభుత్వం పని చేస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి ద్వారా 67 మంది లబ్ధిదారులకు రూ.36,85,956 విలువైన చెక్కులు ఆయన ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కోడూరి శేష బ్రహ్మాచారి, టిడిపి బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు రావిపాటి సీతయ్య, తాటి నాగేశ్వరరావు, నల్లపుని రంగయ్య చౌదరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రను సన్మానిస్తున్న శ్యాంసుందర్ రాజు

ఉగ్రను కలిసిన శ్యాంసుందరరాజు

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మండలంలోని అంబవరంనకు చెందిన టిడిపి నాయకుడు ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ఆదివారం కలిశారు. పర్యాటక శైవ క్షేత్రం భైరవకోన ట్రస్టు బోర్డు చైర్మన్‌గా శ్యామ్ సుందర్ రాజు సోమవారం పదవి బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా ఆయన మండలంలోని టిడిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని కలిశారు. తనను నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, బత్తుల వెంకటాద్రి, ఇండ్ల శ్రీను, ముప్పాళ్ళ మోహన్ రాజు ఉన్నారు.

సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జరిగే రాష్ట్ర, జిల్లా స్థాయి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎపి టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలాని అన్నారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో సాధారణ కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షులు అమృతపూడి శేఖర్ బాబు, ఉపాధ్యక్షులు మడుగుల కిషోర్, పి వెంకటేశ్వరరావు, కె శ్రీనివాసరావు, గోవా రవి, ప్రధాన కార్యదర్శి పిడి సోషలిజం, కార్యదర్శులు కెవి నారాయణ, దాసరి కృష్ణవేణి, వై చెన్నకేశవులు, సిహెచ్ శ్రీనివాసరావు, జె శ్రీనివాసరావు, కె వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు టి శ్రీనివాసరావు, కె రామయ్య, ఎం పద్మావతి, ఎస్ఎస్ శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి నాగాంజనేయులు ఎన్నికయ్యారు. సయ్యద్ చాంద్ బాషా ఎన్నికలు నిర్వహించగా షేక్ జిలాని పర్యవే క్షించారు.

తాళ్ళూరు : ఒంగోలులో ఆదివారం జరిగిన ఎపిటిఎఫ్ ప్రకాశం జిల్లా నూతన జిల్లా కౌన్సిల్ సమావేశం మండల గౌరవ అధ్యక్షులు సంగు రవిచంద్రరెడ్డి, అధ్యక్షులు గండూరి నాగరాజు, ప్రధానకార్యదర్శి నారిపెద్ది శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్స్ పోలంరెడ్డి సుబ్బారెడ్డి, పోకూరి శ్రీదేవి, ఖాజావలి, మిత్రులు కొండపల్లి జవహర్‌బాబు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ బహూకరణ

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మండల కేంద్రమైన సిఎస్‌పురంలో జనవరి 7 నుంచి బిఎస్ఆర్ మెగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల నిర్వహణకు అవసరమైన క్రికెట్ కిట్ గ్రామానికి చెందిన చెన్నైలో పిజి వ్యాపారం చేస్తున్న విష్ణు పిజి ఓనర్ మారెళ్ళ రవికుమార్ అందజేశారు.

12వ పీఆర్సీ అమలు చేయాలి

ఆర్థిక బకాయిలకు రోడ్‌మ్యాప్ ఇవ్వాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక బకాయిలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటిఎఫ్) ప్రకాశం జిల్లా 51వ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన ఆదివారం ఒంగోలు టీటీడీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు ఒక గంట అదనంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే యుటిఎఫ్ లక్ష్యమని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలని, తెలుగు, ఇంగ్లీష్ మీడియాన్ని సమాంతరంగా ప్రవేశపెట్టాలని, టెట్ పరీక్షల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, జెడ్పీ పీఎఫ్ కార్యాలయంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవ్, హెల్త్‌కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందించాలని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే పాఠశాలలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యా పాలనలో రాష్ట్ర కేంద్రీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూతన జిల్లాల కమిటీల ఎన్నికలు జరిగాయి.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

నూతన కమిటీల ఎన్నిక..

ప్రకాశం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కిలారి వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ హై, గౌరవాధ్యక్షులుగా ఎస్ రవి, సహాధ్యక్షులుగా వై వెంకట్రావు, జి ఉమామహేశ్వరి, కోశాధికారిగా ఎన్ చిన్నస్వామి ఎన్నికయ్యారు.

మార్కాపురం జిల్లా కమిటీ ఎన్నిక

యుటిఎఫ్ మార్కాపురం జిల్లా గౌరవాధ్యక్షులుగా ఐవి రామిరెడ్డి, అధ్యక్షులుగా ఎస్‌కే ఖాజా రహమతుల్లా, ప్రధాన కార్యదర్శిగా ఓవీ వీరారెడ్డి, సహాధ్యక్షులుగా బాలవెంకటేశ్వర్లు, ఎస్ ఉమా మహేశ్వరి, కోశాధికారిగా బి శ్రీరాములు ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను సంఘ రాష్ట్ర కార్యదర్శులు జివి రమణ, నవకోటేశ్వరరావు నిర్వహించారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, జివి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా: కిలారి వెంకటేశ్వర్లు, అబ్దుల్ హై, మార్కాపురం జిల్లా: ఖాజారహంతుల్లా, ఓవీ వీరారెడ్డి

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా డాక్టర్ వి వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని, పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్‌పి బి ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశం ఉన్నందున, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆదివారం ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వివిధ సమస్యలను విన్నవించుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి రాదలిచినవారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేటి పోలీసు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోలీసుల వార్షిక నేర సమీక్షా సమావేశం జరగనున్న దృష్ట్యా, ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అనవసరమైన వ్యయ ప్రయాసలు భరించి జిల్లా పోలీస్ కార్యాలయానికి రావద్దని ఎస్‌పి కోరారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కార్డ్స్-ఇన్నోవ్‌సోర్స్, టాటా ఎలక్ట్రానిక్స్, స్టాఫ్ క్లౌడ్ సొల్యూషన్స్ సంస్థల్లో వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఇ, బిఆర్ఇ, టెలికాలర్, టీమ్ లీడర్, బీడీఎం, క్యూఏ, క్యూసి, ఉత్పత్తి, మెషిన్ ఆపరేటర్, బెంచ్ సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ అండ్ ప్రొడక్షన్ సపోర్ట్, పికింగ్ మరియు ప్యాకింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులకు ఎంపిక జరగనుందన్నారు. టెన్త్, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నెలకు రూ.12,000 నుంచి రూ.24,000 వరకు జీతంతో పాటు పని తీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయం, ఒంగోలులో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో 08592 281776 నంబర్‌లో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

మాజీ ఎంపిటిసి లక్ష్మీ నరసయ్య వర్ధంతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్లలో మాజీ ఎంపీటీసీ కామ్రేడ్ పిల్లి లక్ష్మీనరసయ్య ప్రథమ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ జిల్లా కార్యదర్శి ధర్నాశి పెద్దన్న మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో ఎన్నో ఏళ్లుగా క్రియాశీలక సభ్యునిగా పనిచేస్తూ ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారని, ఎంపీటీసీగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాగుమడుగు సర్పంచి బూదాల జోసఫ్ కమలాకర్‌రావు, దర్జీల సంఘం మాజీ అధ్యక్షులు పి చిన్న, హైదరాబాద్ హెచ్‌ఎంటి హిల్స్ కాలనీకి చెందిన బిల్డర్ వి కోటేశ్వరరావు, వీఆర్‌ఏ దార్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ చట్టసవరణపై

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

షేక్ మాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీనరేగా)ను కాపాడాలని, రాష్ట్రానికి, పేద ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే కొత్తగా ప్రతిపాదిం చిన (వీబీజిరామ్‌జి) చట్టాన్ని అడ్డుకోవాలని కోరుతూ సోమవారం నాడు ఒంగోలు సుందరయ్య భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించ నున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు ఆదివారం నాడు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో వామపక్ష పార్టీలతో పాటు లౌకిక రాజకీయ పార్టీలు, ప్రజాతంత్రవాదులు పాల్గొంటారని అన్నారు. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ఉపాధి హక్కును పరిరక్షించేందుకు ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా ఆదివారం నాడు జరిగింది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న వివిధ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి తమ విద్యాభ్యాస రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమ్మేళనంలో తమను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన గురువులను గుర్తు చేసుకుని, తరగతి గది, హాస్టల్ అనుభవాలను పంచుకున్నారు. తమ జీవితాల్లో సాధించిన విజయాలను వివరించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సి శివరాం మాట్లాడుతూ, ఇలాంటి సమ్మేళనాలు పూర్వ విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంపొందించడమే కాకుండా, గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తపరిచే వేదికగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు.

నాగరత్నంకు పలువురు నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు మాతృమూర్తి వెంకట నాగరత్నం సంస్మరణ కార్యక్రమం ఆదివారం సంతనూతలపాడులో జరిగింది. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్ పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాగరత్నం కుమారులు సురేష్‌బాబు, శ్రీనివాసరావు, అల్లుడు, కుమార్తెలైన మొనపాటి వెంకట్రావు, సుజాతలకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగరత్నంకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

ఎస్ఎస్‌సి ఫలితాలకు కార్యాచరణ: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్ఎస్‌సి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రకాశం జిల్లాలో కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం నాడు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 354 హైస్కూళ్లకు గెజిటెడ్ అధికారులను అడాప్టింగ్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలను మెరుగుపరచేందుకు ఈ కార్యాచరణను డిసెంబర్ 2025 నుంచి అమల్లోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దత్తతాధికారి తమకు కేటాయించిన పాఠశాలపై పూర్తి బాధ్యత వహిస్తూ ఫలితాలపై దృష్టి సారించి పనిచేయాలని కోరారు. దత్తతాధికారులు వారానికి కనీసం రెండుసార్లు పాఠశాలలను సందర్శించి విద్యా పర్యవేక్షణ, విద్యార్థుల ప్రోత్సాహంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. నెమ్మదిగా నేర్చుకునే, సరిహద్దు స్థాయి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యాచరణను సమర్థంగా అమలు చేసి ఎస్-ఎస్‌సి ఫలితాల్లో మెరుగుదల సాధించిన మూడు ఉత్తమ పాఠశాలలకు పనితీరు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు.

సిఐటియు జాతీయ మహాసభల ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలులో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలన్న పిలుపుతో ఆదివారం ప్రకాశం జిల్లా సంతనూతల పాడు మండలంలో విస్తృత ఆటో ప్రచారం నిర్వహించారు. సిఐటి యు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు నాయకత్వంలో సాగిన ఈ ప్రచారం మండలం లోని పలు గ్రామాలలో కార్మిక వర్గాల్లో చైతన్యం నింపింది. గ్రామగ్రామాన ఆటో ద్వారా చేరిన ప్రచార బృందానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఘన స్వాగతం పలికారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల ప్రజావ్యతిరేక విధానాలు, కార్మిక హక్కులపై జరుగుతున్న దాడులు, ఉద్యోగ భద్రత క్షీణతపై నాయకులు వివరించారు. కార్మికుల ఐక్యతే ఈ దాడులకు సరైన సమాధా నమని, జాతీయ మహాసభలు భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేయనున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేర్న మిట్టలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యత కీలకమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎస్‌కే నాగూర్‌వలి, కృష్ణారెడ్డి, చినబాబు, తుళ్లూరు సుబ్బారావు, పొత్తూరు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో మాట్లాడుతున్న సీఐటీయు నాయకుడు బంకా సుబ్బారావు

సంతనూతలపాడు: సీఐటీయు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలో ప్రచార జాతాను నిర్వహించారు. మండలంలోని సంతనూతల పాడు, మంగమూరు, పేర్నమిట్ట, కామేపల్లివారి పాలెం, చంద్రపాలెం, గంగవరం, తక్కెళ్లపాడు, చిలక పాడు, లక్ష్మీపురం, రుద్రవరం, గురవారెడ్డిపాలెం, చలప్పాలెం, మైనంపాడు, ఎండ్లూరు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్నమిట్టలో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రచార జాతాలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బంకా సుబ్బా రావు పాల్గొని ఉపన్యసించారు. ఈ జాతాలో సీఐటీయు మండల కన్వీనర్ షేక్ మస్తాన్, నాయకులు షేక్ నాగూర్, పొత్తూరి చిన్నశేషయ్య, గుండవరపు వెంకట సుబ్బారావు, కోడూరి రామకృష్ణారెడ్డి, తుళ్లూరు సుబ్బారావు, దాసరి చినబాబు, కైలా అనీష్, తిప్పాబత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.